

# పెద్దకథ:

రాఘవయ్యగారు గట్టిగా విసుక్కున్నారు.

"చూడు మూర్తీ, అప్పుడే తొమ్మిద యింది. ఇంతవరకూ నాలుగు సార్లు బాత్‌రూమ్‌లోకి వెళ్ళాను. ఒక్కసారీ నీళ్ళు రాలేదు. నేనెలా స్నానం చెయ్యాలని?— చూడక, చూడక నాకు మంచి ఇల్లే చూశావు" — అన్నారాయన భుజాన్ని తువ్వాలు వేసుకుని వచ్చి గదిలోని కుర్చీలో కూలబడుతూ.

నాకు రాఘవయ్య గారికీ ఇలాంటి సంభాషణలు తరచు మామూలే. ఆయనలా అంటున్నప్పుడు ఒక్కోసారి నాకు నవ్వు కూడా వస్తూ వుంటుంది. నవ్వితే మట్టుకు రాఘవయ్యగారు మండి పడతారు.—"ఈ ముసలాడు బాధ పడుతూవుంటే నీకు నవ్వులాటగా వుంటుంది. అందుకే నాకీ కుర్రాళ్లతో స్నేహం చెయ్యడం అంటే ఒళ్ళు మంట"—అంటారు బుసలుకొడుతూ.

నిజానికి— నాకు రాఘవయ్య గారికీ వయస్సులో దాదాపు ముప్ఫయియేళ్ళ వ్యత్యాస ముంది. ఆయన అరవయ్యోపడి తొలి భాగంలో వుంటే, నేను ముప్ఫయ్యోపడి స్వాగతద్వారాల దగ్గర వున్నాను. నాకు రాఘవయ్యగారికీ స్నేహం ఎందుకు కలిసిందో, ఎలా మొదలయ్యిందో నాకుసరిగా గుర్తులేదు గానీ— మేం ఒకళ్ళ నొకళ్ళు తొలిసారి కలుసుకున్న వేళా విశేషంమటుకు చాలా మంచిది. రిటైర్డు స్టేషన్‌మాస్టర్ రాఘవయ్యగారు నాకోమంచి కాలక్షేపం బటానీలా కనబడేవారు. "ఈ కుర్రాళ్ళకి డిగ్రీలేగాని బొత్తిగా ప్రపంచ జ్ఞానం లేదోయ్— ఎం. ఏలూ, పి.హెచ్.డిలు చేసెయ్యగానే సరా మన సంస్కృతీ సంప్రదాయం వీళ్లకేమి తెలుసని?—" అని ఆయన ఒక్కోసారి యువతరం మీద విరుచుకు పడినా, ఆ విసుర్లన్నీ నామీద ననే తెలిసినా— రవ్వంత సహనం వహించి వుండి ఆయనతో మాటలు కలిపేవాడిని. మంచితన మనబడే నాస్వభావాన్ని చూచి రాఘవయ్యగారు ముచ్చట పడేవారు. యువ తరంలో వున్న లోపాలన్నింటిని నా మొహం చూసి క్షమించి నాతో స్నేహంకట్టే వాడు. మా ఇద్దరి మధ్య స్నేహం ఇంత బలీయమైంది కాబట్టే — ఎక్కడో మహా

రాణి పేటలో రాఘవయ్యగారిని దూరంగా వుంచడం ఇష్టం లేక డాబా గార్డెన్స్‌లోకి మాయింటికి దగ్గిరిగా ఆయనికి ఇల్లు చూశాను. అందులోని ఒక వాటాలో ఆయనిని దింపాను. అనగా దిగమన్నాను. నే చెప్పిందానికి ఒప్పుకోనడంలో ఆయన స్వార్థం కూడా వుంది. ఆయన మహారాణి పేటలో వుండేటప్పుడు ఎప్పుడో ఆదివారాలలో తప్ప రాఘవయ్యగారి దగ్గిరకు వెళ్ళేందుకు అవకాశం చిక్కేది కాదు— డాబా గార్డెన్స్‌లో అయితే యూనివర్సిటీనించి వచ్చిన తర్వాత ప్రతిసాయింత్రం నేను ఆయనతో కాలక్షేపం చేసేందుకు అవకాశం వుంటుంది. ఈస్వార్థం తోనే ఆయన డాబా గార్డెన్స్‌లోకి వచ్చారు.

అయితే— కథ ఇంతవరకూ బాగానే వుంది. అయితే— డాబా గార్డెన్స్‌లోని ఆ ఇల్లు మిధ్యా సుందరీదేవి గారిది కావడమూ, మిధ్యా సుందరికీ రాఘవయ్యగారికీ మధ్యవున్న సంబంధాలు ఇండో పాకిస్తాన్ వ్యవహారాల్లాగా పరిణమించడమూ, కాశ్మీరు సమస్యలాగా నీటి కుళాయి సమస్య తీవ్ర రూపం దాల్చడమూ కథ పాకాన పడేందుకు దోహదం చేశాయి. పానకంలోపడ్డ ఈగలాగా నేను ఈ మధ్యలో ఇరుక్కు పోయాను.

"నువ్వు వెయ్యి చెప్పు. లక్ష చెప్పు —మూర్తీ—ఆ మిధ్యా సుందరి వ్యవహారం మాత్రం నాకు సుతరామూ నచ్చలేదు. నీ స్నేహితురాలు కావచ్చుగాక— నాకేమీ భయం లేదు— డివిజినల్ సూపర్నెంటునే ఖాతరు చెయ్యని మనిషిని నేను—" కోపంతో రుసరుస లాడిపోతున్నారు రాఘవయ్య గారు.

రాఘవయ్య గారికి నేనంటే ఎంత అభిమానమో, మిధ్యాసుందరితో నాకున్న పరిచయాన్ని చూస్తే ఆయనకంత ఒళ్లుమంట—ఇది చదివి మీరు—పాపం—యూనివర్సిటీ కుర్రాడు ఏదో అందమైనఅమ్మాయి కదా అని మిధ్యాసుందరితో స్నేహం చేసి వుంటాడు.—అంత మాత్రాన ఈ ముసలాడికి కోపం వచ్చెయ్యడమేనా?— కుర్రాళ్ళు వయస్సులో వున్న వాళ్లతో కాపోతే—ముసలాళ్లతో స్నేహం చేస్తారా? అని నన్ను సమర్థించడానికి తాపత్రయ పడితే మీరు పొరబడ్డారన్న మాటే—నాకు మిధ్యాసుందరికీ స్నేహం అనే మీతోచెప్పాను గాని, మిధ్యాసుందరి వయస్సు ఫలానా, రూపం ఫలానా, అని మీకు చెప్పలేదు. —మన కథా నాయకురాలు మిధ్యాసుందరికి సమంగా యాభై ఏడు సంవత్సరాలు. గవర్నమెంటు హైస్కూలులో హెడ్ మిస్ట్రెస్‌గా పనిచేసి మొన్ననే రిటైరు అయింది. పూర్వసువాసిని అయిన మిధ్యాసుందరిగారి భర్త బతికున్న రోజుల్లో ఇంజనీరు పనిచేసి రెండు చేతులా, రెండు జేబుల్నిండా సంపాదించాడనీ, ఆడబ్బుతోనే రిటైరయి పోయిన తర్వాత డాబా గార్డెన్స్‌లో మిధ్యాసుందరి మేడ కట్టించిందనీ, లేకుంటే బడి పంతులమ్మకి మేడ ఎట్లా వస్తుందని కొందరు గిట్టని వాళ్లు, గిట్టిన వాళ్లు కూడా అంటూ వున్నందున దాన్ని మనం నిజంగానే భావించుకోవచ్చు. ఇకపోతే—ఈ మిధ్యా సుందరికి మా కుటుంబానికి దూరపు చుట్టరిక మున్నందున ఆవిడ నాకు మొదటిలో బంధువుగా పరిచయమై ఆతర్వాత నాగర్ల్ ఫ్రెండు (ఆవిడను గర్ల్ అండానికి మీకే విధమైన అభ్యంతరం లేకపోతే) గా స్థిర పడిపోయింది.

ఇంతకూ నేను అసలు కథ చెప్పలేదు— మిధ్యాసుందరిగారి ఇంటికి వున్న ఓవర్ హెడ్ టాంకు మన ఆర్థిక వ్యవస్థలా అస్తవ్యస్తంగా పని చేస్తోంది. దానికి వంట్లో బాగుండి పనిచేస్తున్న కాసేపయినా ఆ నీళ్ళు రాఘవయ్యగారి క్రింది వాటాలోకి రాకుండా మిధ్యాసుందరి గారు అడ్డేస్తారు. రాఘవయ్య గారి మాటల్లో చెప్పాలంటే బట్టలు ఉతికే మిషతోనో, మంచినీళ్లు పడుతున్నామనే నెపంతోనో, స్నానం చేస్తున్నామనే వంక తోనో, నీళ్ళు కాస్త క్రిందికి రాకుండా చేస్తారు. పొద్దున్నించి రాఘవయ్యగారికి స్నానం చేద్దామంటే అలవి కాకుండా వున్నది. ఈఘోరాని కంతటికీ కారణం ఈ ఇల్లు చూపించిన నేను—నాస్నేహితురాలనబడే ఈ యింటి యజమానురాలు మిధ్యా సుందరీను. ఇదీ ప్రాసిక్యూషన్ కథనం. డిఫెన్సు వారి వాదం వేరే వుందనుకోండి—మధ్యన నేను ఐక్యరాజ్యసమితిలా ఇరకాటం పడి పోవాల్సి వచ్చింది. "మిధ్యా సుందరి గారు ఇంటి యజమానురాలు. ఆవిడకు ఈ ఇంటిమీద సర్వ హక్కులు, అధికారాలూ వున్నాయి. ఆవిడ స్వేచ్ఛకు మీరు అడ్డురావడం అక్రమం—" అనిగాని నేను అన్నానా— రాఘవయ్యగారు తన చేతి కర్రకు పని కల్పిస్తారు. అంతే కాదు— తన ముప్ఫయిఏళ్ళ సర్వీసులో ఎంతమంది పెద్ద ఆఫీసర్ల మాటలను కొట్టిపారేసిందీ—ఎంతమందికి ధైర్యంగా ఎదురు తిరిగి భట్టి విక్రమార్కుడిలా నిలబడ్డదీ, చెబుతూ, నాదేహానికి, బుర్రకీ కూడా పని కల్పిస్తారు. అందువల్ల అంతటి సాహసం నేనెప్పుడూ చెయ్యలేదు—చెయ్యను.

ఇక పోతే — మిధ్యాసుందరి విషయం. ఆవిడ రాఘవయ్యగారిలా ప్రథమ కోపి కాదు. —చేసేదేమో చెప్పకుండా గుట్టు చప్పుడు కాకుండా చేసే రకం. స్త్రీల హృదయం అర్థం కాదనీ, అదొక అగాధమనీ, నాకు మిధ్యాసుందరిని చూశాకతర్వాతే తెలిసింది. నాకు జీవితం సర్వీసులో దాదాపు ముప్ఫయ్యేళ్ళు వచ్చేస్తున్నా నాకు సన్నిహితంగా వచ్చిన ఆడది మిధ్యాసుందరి ఒక్కతే. ఈ విషయం పైవాళ్ళతో నేను అనకపోయినా, విషయం పసికట్టినవాళ్లు మాత్రం నన్ను "ఎలా వుంది యోర్ ఫ్రెండు?" అంటూ వేళాకోళం పట్టించే వాళ్లు— ఎవరేమి అంటేనేంగాని—ఒక్కటిమాత్రం నేను నిశ్చయంగా చెప్పగలను—జీవితంలో సగ భాగం దాటిపోయినా మిధ్యాసుందరి తన వయస్సును ఒప్పుకోదు— తనకోసం తనని అభిమానించే వాళ్ళుంటారనే ఆశ ఆవిర్లించి తప్పుకోదు. ఏళ్ళు పెరిగి పోతున్నా తనింకా 'ఆడపిల్ల' ననుకునే మిధ్యాసుందరిని చూస్తే నాకు నవ్వుకూడా వచ్చేది. మొత్తం మీద నేనుచూరచిపోలేని వ్యక్తుల్లో మిధ్యా సుందరి ఒకతె.

"ఏమిటోయ్—ఉలకవు, పలకవు. నీ స్నేహితురాలిది తప్పని ఒక్క మాటంటే నీనోట ముత్యాలు రాలిపోవు—" రాఘవయ్యగారు మరోసారి కసురుకున్నారు.

ఆయనకు నేనేదో సమాధానం చెప్పే లోపున బాత్‌రూమ్‌లోని కుళాయిలోంచి నీళ్లు బడబడామని ధారగా పడటం ప్రారంభించాయి. గంగను సాక్షాత్కరించుకున్న భగీరథుడిలాగా రాఘవయ్యగారు థౌజెండ్ కేండిల్ బల్బువెలుగుతో తటాలున బాత్‌రూమ్‌లోకి దూరడంతో—"హమ్మయ్యా"

అని తేలిగ్గా నిట్టూర్చాను నేను.

* * *

ప్రక్క రోజు నేను యూనివర్సిటీ నించి వస్తూ ఓసారి రాఘవయ్య గారిని పలకరించి పోదామని ఆయన గదిలోకి వెళ్ళబోతే ఇంటి తలుపు వేసి వుంది. ఈ వేళప్పుడు ఎక్కడికి వెళ్లిఉంటారబ్బా అనుకుంటూ వెనక్కి తిరిగి పోదామను కుంటూ వుంటే, మేడమీదనించి మిథ్యా సుందరి నౌఖరు ఆండాళమ్మ నన్ను పిలుస్తోంది — "అమ్మగారు మిమ్మల్నోసారి రమ్మంటున్నారు—" అంది. మరేదో గొడవలా వుంది, అనుకుంటూ పైకి వెళ్లాను.

నే వెళ్లే సరికి మేడమీద వున్న డ్రాయింగ్‌రూమ్‌లో మిథ్యాసుందరి నవ్వుతూ నిలబడివుంది— "రామూర్తీ!— నీకోసం ఇప్పుడే నీ రూమ్‌కి కబురు పెడదామను కుంటున్నాను—నువ్వే కనబడ్డావు—" అంది.

మిథ్యా సుందరి ఆవేళ తలంటి పోసుకుని వాలుజడ వేసుకుంది. నీలంరంగు జార్జెట్‌చీర, అదేరంగు జాకెట్టు వేసుకుంది. ఏళ్ళొచ్చి మీద పడ బట్టీకాని— అచ్చు అందమైన కన్నె పిల్లలా కనబడి వుండేది మిథ్యాసుందరి— ఈ వయస్సు ఈవిణ్ణి ఎంత అన్యాయం చేసిందీ అని పించింది నాకు—"కూర్చో మూర్తి!—ఏమిటలా నిలబడిపోయావు—?" అంది మరోసారి నవ్వుతూ, నెరిసిన తెల్ల వెంట్రుకల్ని దాచాలని విశ్వ ప్రయత్నం చేస్తూ—

నేను ఆగదిలో కూర్చున్న కాసేపట్లోనే ఆండాళమ్మ రెండు ప్లేట్లనిండా ఫలహారాలతో ప్రత్యక్ష మయింది. నేను ఆశ్చర్యంతో చూస్తూ వుండిపోయాను. —"మరేంలేదు మూర్తీ!— ఇవాళ నా పుట్టిన రోజు—ఏదో చిన్న సరదా అంతే—"

నిజం చెప్పొద్దూ—మిథ్యా సుందరి మాటలు వింటూంటే నాకు పెద్ద నవ్వు వచ్చింది. మనమల పుట్టిన రోజులు చెయ్యాల్సిన వయస్సులో ఓపిగ్గా ఈవిడ తన పుట్టిన రోజులు చేసుకొంటోంది. నిజానికి— మిథ్యాసుందరికి పిల్లలే లేనందున మనములన్న వారే లేరు— అందువలన వాళ్ల పుట్టిన రోజులు జరుపాల్సిన ప్రసక్తే లేదు.—అందుచేత ఓ విధంగా ఆలోచిస్తే మిథ్యా సుందరి చేసిందాంట్లో సబబు లేని పని నాకేదీ అగుపించలేదు. "చాలా థేంక్స్—మంచి అకేషన్‌కి పిలిచారు నన్ను—మరి బర్త్‌డే కేండిల్స్ ఏవీ?"— అన్నాను జిలేబీ ముక్క విరిచి నోట్లో పెట్టుకుంటూ— ఇలా అనడంలో నాకు ఓ దుర్బుద్ధి లేకపోలేదు.—ఈమార్గంతోనయినా కొంత కాపోతే కొంత వరకయినా మిథ్యా సుందరి వయస్సు రాబట్టొచ్చని నా ప్రయత్నం.

నామాటలకు మరోసారి నవ్వుతూ— "నాకిలాంటి సెర్‌మనీస్ అంటే పెద్ద పట్టింపు లేదు—ఆప్తులయిన ప్రియ మిత్రులెవరితోనో సంతోషంగా గడపడం మినహాగా నేనీ పుట్టిన రోజుకు పెద్ద విలువ ఇవ్వను"

గతుక్కుమన్నాను నేను— మిథ్యాసుందరి ఆప్తకోటిలో నేను ఉండడం నాకు చాలా ఆనందంగాను, గర్వకారణంగాను, కూడా వుంది. నాలోని మరో మానవుడు సరదాగా కాలరెత్తుకున్నట్టనిపించింది.

"నిజానికి నేను ఇవాళ ఇద్దర్నే పిలిచాను— ప్రొద్దున నీకోసం రూమ్‌కి కబురు పెడితే రోజుకన్నా త్వరగా యూనివర్సిటీకి వెళ్ళి పోయారన్నారు. ఇకపోనీలే, ఇంటిలో వుంటున్న మనిషి కదా అని రాఘవయ్య గారికి కబురు పెడితే—వస్తే వస్తాననీ, లేకపోతే రాననీ చెప్పచ్చుకదా—అలా కాకుండా నాకూ, మీ యజమానురాలి పుట్టిన రోజుకు ఏవిధమైన సంబంధమూ లేదు— ఆవిడ పుట్టిన రోజుకు రానాల్సిన అవసరం అంతకన్నా లేదు— పుట్టినరోజా మిష పెట్టి ఏవో నాలుగు కాజాలు పెట్టి— మీరు పెడుతున్న ఇబ్బందు లన్నింటిని నన్ను మరచి పొమ్మంటారేమో—అదేం కుదరదు. —మీ ఆగడాలను నేను సహించబోయేది లేదు— ఓవర్ హెడ్ టేంక్ బాగుచేయించే దాకా నేను ఇంటిఅద్దె కట్టేదిలేదు— మీతో మాట్లాడేది లేదు— అంటూ పిచ్చి పిచ్చిగా నోటికొచ్చినట్టు మాట్లాడట— చూడు మూర్తీ—పుణ్యానికి పోతే పాపం ఎదురయిందంటారే అలావుంది నాపరిస్థితి. మర్యాదగా టీ పార్టీకి రమ్మని పిలిచిన వాళ్లకు పెద్దమనిషి చెప్పాల్సిన సమాధానం ఇదేనా?—నువ్వేదో మర్యాదస్తుడనీ, ముసలాడనీ, (ఎదుట వ్యక్తుల ముసలితనాన్ని బేరీజు వెయ్యటంలో మిథ్యా సుందరికున్న ప్రతిభ మరెవరికీ లేదు—తను ఒక్కర్తే చిన్నపిల్ల అయినట్టు రాఘవయ్య ఒక్కడే ముసలాడు అయినట్టు మాట్లాడే మిథ్యా సుందరి మాటలు వింటూంటే నాకు తెగ నవ్వు వస్తోంది.) మరీమరీ చెబితే కాదనలేక అద్దెకిచ్చాను. లేకుంటే నేను ఒక్కెతనూ ఉన్న ఇంట్లో పిల్లాపీచు ఎవరూ లేని రాఘవయ్యకు చస్తే అద్దెకుఇచ్చే దాన్నికాదు. ఇలాంటి అలగాజనం అంటే అసహ్యం నాకు—" అంది ఏక ధాటిగా మాట్లాడుతూ మిథ్యా సుందరి. కదవామీదకే తిరిగి నందుకు గతుక్కుమన్నాను.



పకోడీలోని మిరపకాయని కొరకడంతో గడగడా మంచినీళ్ళు తాగేశాను. ఇక్కడే మరో విషయం చెప్పాలి. మిథ్యాసుందరి ఇంట్లో ఖాళీగా వున్న వాటాకు రాఘవయ్యగారిని సజెస్టు చేసినప్పుడు మొదట మిథ్యాసుందరి ఒప్పుకోలేదు— ఎందుకంటే —రాఘవయ్యగారి భార్య చాలాకాలం క్రిందటనే చనిపోయి నందునా అతడికి పిల్లలెవరూ లేనందునా, ఆయనఒక్కరూ బ్రహ్మచారిలాగా ఆ వాటాలో వుండాలి. నేను ఒంటరిగా వున్న 'ఆడ పిల్లను' బ్రహ్మచారులు నాయింట్లో వద్దన్నది మిథ్యాసుందరి. ఆవిడ మాటలు వింటూంటే తెగ నవ్వు వచ్చినా,—దాన్నంతటినీ ఆపుకుంటూ, మిత్రప్రేమ కొద్దీ రాఘవయ్యగారి పెద్దమనిషి తనం గురించి ఉపన్యాలు దంచి మిథ్యా సుందరిని ఒప్పించాను. ఇప్పుడు వాటన్నిటినీ వడ్డీతో సహా దెప్పుతోందావిడ— ఎరక్కపోయి వచ్చానుకదా ఈ బర్త్‌డే పార్టీకి అనుకున్నాను కాఫీ త్రాగుతూ.


"రాఘవయ్య నీకెంత స్నేహితుడవు గాక—ఓ విషయం మాత్రం చెబుతున్నాను విను. ఓవర్ హెడ్ టేంకుకు అప్పుడప్పుడు కాస్త రిపేరు వస్తున్న మాట నిజమే—దేముడు చేసిన మనుషులకే అన్నన్ని రిపేర్లు కావలసి వస్తుంటే— మనిషి చేసిన యంత్రానికి రిపేర్లురావుటయ్యా?—ఏ రిపేరు అక్కర్లేకపోతే ఈ

రాఘవయ్య అన్నిసార్లు ఆ డాక్టర్లచుట్టూ ఎందుకు తిరుగుతాడు? —సర్లే —అతని గొడవ నాకెందుకు గానీ — నాసంగతి చెబుతా విను.

ఆ వాటాకు ప్రక్కనే నుయ్యి వుంది— ఈ రాఘవయ్య నూతిలో నీళ్ళు తీసుకుని ఎరుగని సుకుమారుడేమీ కాదు—చాలాకాలం చిన్న వూళ్ళల్లో స్టేషన్ మాస్టరుగా పని చేసిన వాడే— ఈ వేళ ఎక్కడలేని షోకు వచ్చేసింది. అదీగాక, కుళాయి సరిగ్గా వచ్చిందాకా అద్దె ఇవ్వననడానికి ఇతగాడెవరని?— ఒకటోతారీఖుకు అద్దె ఇవ్వకపోతే ఆండాళమ్మను సామాను అవతల పారెయ్యమంటాను. ఈ ముసలాడు ఏంచేస్తాడో చూస్తానేను" —అంది కోపంతో.

పరిస్థితి విషమించ బోతూంధని తెలిసి — గడగడ కాఫీని గొంతులోకి పోసుకుని కప్పును టీపాయ్‌మీద పెడుతూ— "అబ్బేబ్బే—ఏదో కోపంమీద అని వుంటారు. —రాఘవయ్య గారు పెద్దమనిషి—అలాంటి వారుకారు—ఆయన సంగతి నేను చూచుకుంటాను కదా—మీరు అనవసరంగా ఆందోళన పడకండి. అయినా—పుట్టిన రోజు పూట ఇలాంటి మాటలు మాట్లాడకూడదు—" అన్నాను నవ్వుతూ ప్రసంగం మారుద్దామని.

పుట్టినరోజు ప్రస్తావన రాగానే మిథ్యా




సుందరి కొంత మెత్తబడింది—"అదేదో నువ్వే తేల్చు. వ్యవహారం నీకే విడచి పెడుతున్నాను. అది సరే— ఇప్పుడు నీకేమన్నా ముఖ్యమైన పనులున్నాయా?—"అంది—

మిథ్యా సుందరి మాటలను అర్థం చేసుకోలేని నేను—"అబ్బే ఏమీ లేవే—" అన్నాను—"అయితే—ఇవాళ మనమిద్దరం కలసి సినిమాకు వెళదాం—లీలామహల్‌లో మంచి ఇంగ్లీషు సినిమా వుందట—" అంది మిథ్యా సుందరి.

షాక్ తిన్నట్టుఫీలయ్యాను నేను— ఆవిడతో సినిమాకు వెళ్ళకూడదని నాకేమీ నిబంధన లేదుగాని— బొత్తిగా అంత వయస్సు వున్న ఆవిడను వెంటబెట్టుకుని సినిమాకు వెడితే—కొలీగ్ రిసెప్షనిస్టులెవరయినా చూస్తే వేళాకోళం చేస్తారేమోనని భయం. అలా అని, ఆవిడ మాటను కాదనే ధైర్యం కూడా లేదు నాకు. అందువల్ల ఆవిడకోపం మరింత ఎక్కువచేసినట్లవుతుంది. ఏం మాట్లాడలేని పరిస్థితిలో మౌనంగా ఆవిడ ననుసరించి సినిమాకు బయలు దేరాను. బొత్తిగా ఐక్యరాజ్యసమితి నయిపోతున్నాను నేను.

* * *

ఇంతవరకూ కథ బాగానే వుంది. అయితే —చిక్కెక్కడొచ్చిందంటే, ఆరోజున అదే సినిమాకు, అదే ఆటకు, రాఘవయ్యగారనబడే మన కథానాయకుడు కూడా రావడంతో కథ పరాకాష్ఠ కొచ్చింది. ముసలి పెళ్ళాం పడుచు మొగుడూ లాగా పక్కప్రక్కన కూర్చున్న మేమిద్దరం రాఘవయ్యగారి కంట బడ్డాం—అదీ మిథ్యాసుందరి ఇప్పించిన కోకో కోలా త్రాగు తూండగా—నాకు కోకోకోలా పులక మారాల్సిందే— ధైర్యం కూడదీసుకుని ఆ పదార్థం కాస్త త్రాగేసి రాఘవయ్య గారిని చూడనట్టుగా కూర్చున్నాను, ప్రక్కరోజు జరుగబోయే సంఘటనలను ఊహించు కుంటూ —

అనుకున్నట్టుగానే రాఘవయ్య గారికి కోపం వచ్చింది—ఈ విషయం నాకు ప్రక్కరోజున ఆయనింటికి వెళ్ళినప్పుడు ఆయన పలక రింపుతోనే అర్థం అయింది— "ఏమయ్యా ఎలా వుంది నిన్న సినిమా -అడగడం నా తెలివి తక్కువగాని నీకు సినిమా ఎలా కనబడుతుంది?— నేతిబీరకాయలాంటి సుందరి ప్రక్కన

వుండగా...'' అంటూ తన అక్కసు నంతటినీ ఒక్కసారిగా మాటల్లో వెళ్లగక్కుతూ అన్నారు రాఘవయ్యగారు.

నిజానికి— రాఘవయ్య గారికి మిధ్యా సుందరి మీద ఎంత కోపం వున్నదో ఆవిడ పేరు మీద కూడా అంత అక్కసు వుంది. "అదేం పేరోయ్— ఎక్కడా వినలేదు— 'మిధ్య'కు సౌందర్యానికి పొత్తు లేదు— మనకు తెలియందాన్నే కదా మిధ్య అంటాం —అలాంటప్పుడు దానికి సౌందర్యం వుందని ఎలా చెప్పగలం?— ఈ పేరు చూస్తే తెలుస్తోంది. ఈవిడ తల్లిదండ్రులకు ఏపాటి తెలివి తేటలున్నాయో—సరే, ఏదో పెట్టారనే అనుకుందాం— ఇంత వృద్ధాప్యం వచ్చిం తర్వాతనయినా ఆ పేరును ఈవిడ మార్చుకోవాల్సిన అవసరం వుంది. పేరు చూచి నీలాంటి కుర్రవాళ్లు ఈవిడ ఎంత సౌందర్యవతో అని ఊహించుకుని— తీరా మనిషిని చూచిం తర్వాత అంతా మిధ్యే అని తెలుసుకుని బాధపడే అవకాశం వుంది. తన వయస్సుకు తగ్గట్టుగా ఆవిడ తన పేరును ఏ సుందరమ్మనో, సుబ్బాయమ్మనో, మార్చుకుంటే బాగుండును— ఎందుకీ నేతి బీరకాయ పేరు?—'' అంటూ రాఘవయ్యగారు పెట్రైరికల్‌గాను, సిరియస్‌గాను కూడా మిధ్యా సుందరి పేరు మీద విస్తృతోపన్యాసాలు ఇచ్చిన సందర్భాలు అనేకం వున్నందున— ఈ విషయమై నాకు కావాల్సినంత—'బేక్ గ్రవుండ్'

## మిధ్యా

వుంది. రాఘవయ్యగారి సెట్టైర్‌ను సులువుగా అర్థం చేసుకుని నవ్వి. వూరుకున్నాను.—లేకుంటే ఏమనాలి?—ధైర్యాన్ని కూడదీసుకుని—"నిన్న మిధ్యా సుందరి పుట్టిన రోజు''—అన్నాను. ఆమాట నేను అనగానే రాఘవయ్యగారి జేబులోంచి చుట్టను తీసి దాన్ని వెలిగిస్తూ, అన్నారు— "నాకు తెలుసు—''

రాఘవయ్యగారు చుట్ట కాలుస్తూ వుంటే నాకు చూడ ముచ్చటగా వుంటుంది. గుప్పుగుప్పు మంటూ ఆయన పొగ వదులుతూవుంటే నాకు రైలింజను జ్ఞాపకం వస్తుంది. నిజానికి—నాకు చుట్ట కాల్చే వాళ్లంటే అసహ్యం. కాని— రాఘవయ్యగారుమాత్రం ఎందుకో ఎక్సెప్షన్.

రాఘవయ్యగారు ఇంకా ఏం మాట్లాడతారో అని ఆత్రంగా ఎదురు చూస్తున్నాను నేను. ఓక్షణం ఆగి అన్నారాయన—

"మిధ్యా సుందరి తన పుట్టినరోజు పార్టీకి నన్నుకూడా రమ్మని పిలిచింది—''

"అవును నాకు తెలుసు—''అన్నాను.

"తెలుసా?—ఇంకా ఏం తెలుసు?—'' అన్నారు రాఘవయ్యగారు ఆత్రంగా నన్ను చూస్తూ.

"ఏమనాలో తెలిక, ఇబ్బంది పడుతూ మరేం లేదు— అంతే తెలుసు—''అన్నాను.

నామాటలు విని నన్ను తీక్షణంగా చూస్తూ అన్నారు రాఘవయ్యగారు—

"నువ్వు తెలిసినా చెప్పవని నాకుతెలుసు గానీ—చూడు మూర్తీ!—నీ స్నేహితురాలికి అంత అహం పనికిరాదు.—కొళాయి బాగు చేయించమంటే, నాకు వినబడేట్టుగా నోటికొచ్చినట్లు మాట్లాడింది. ఇల్లు నచ్చిన వాళ్లే ఉండవచ్చునట— ప్రతిమనిషికీ నచ్చినట్టుగా ఇల్లు రిపేరు చేయించడం సాధ్యం కాదట— అద్దె మాత్రం ఒకటో తారీఖుకు కావాలట—ఆలా యివ్వక పోతే సామానులు అవతల పారేస్తుందట —నేనేం గాజులు తొడుక్కుని కూర్చో లేదు—ఎలా చేస్తుందో నేను చూస్తాను—'' —కోపంతోరాఘవయ్యగారు వణకిపోతున్నారు.


మిధ్యా సుందరి అంత మనిషిని పట్టుకుని రాఘవయ్యగారు అంతలేసి మాటలు అనడం నాకు బొత్తిగా నచ్చలేదు— అలా అని, ఏదో పక్షం తీసుకోవడం మధ్యవర్తి చేయాల్సిన పనికాదు. కనుక, రాఘవయ్య గారికి నచ్చచెబుతూ అన్నాను— "రాఘవయ్య గారూ!—మీరు అనవసరంగా ఆవేశపడవద్దు. మిధ్యా సుందరిని ఏదో లాగ నేను ఒప్పిస్తాను. నెల తిరిగేటప్పటికి ఆ రిపేరేదో పూర్తయేలా చూస్తాను. మీరుమాత్రం గొడవ పడకుండా అద్దె ఇచ్చెయ్యండి—'' అన్నాను.

ఏదో అనేశానే గానే అన్న తర్వాత నాలిక్కరుచు కున్నాను. మిధ్యా సుందరితో చెప్పా చెయ్యకుండా రాఘవయ్య గారికి ఈ వాగ్దానాన్ని ఇచ్చేసి మధ్య నేను మాటపడిపోతానని భయం వేసింది. అయినా, నోరుజారి పోయాను గనుక చేసేదేం లేదని వూరుకున్నాను.


రాఘవయ్యగారు నామాటలకు చాలా విలువ యిచ్చి, నన్ను మిధ్యాసుందరి రాయబారిగా జమకట్టి— "ఊఁ!—సరే—నువ్వు అన్నావు కాబట్టి ఈనెల అద్దె నీకే ఇస్తాను. నెల తిరిగే లోపున రిపేరు జరక్కపోయిందా అన్నంత పనీ చేస్తాను— రాఘవయ్య అంటే ఎవరో తెలియ జెబుతాను—'' అన్నారు సిరియస్‌గా—

నాగుండెల్లో రాయి పడింది. అక్కర్లేని గొడవలో తల దూర్చాననుకుంటూ నీరసంగా "ఊఁ!—'' అన్నాను.

(ముగింపు పైవారం)



# పెద్దకథ:




(గత సంచిక తరువాయి)

ఇది జరిగిన మరో వారం రోజుల కల్లా ఒకటో తారీఖు రానే వచ్చింది. అన్నమాట ప్రకారం రాఘవయ్యగారు ఇంటి అద్దె నాకిచ్చి మిధ్యాసుందరికి ఇవ్వమన్నారు. ఎలాగూ ఇదివరకు 'కమిట్' అయిపోయాను కనక, చేసేదిలేక—ఆ అద్దె పుచ్చుకుని నన్ను నేను తిట్టుకుంటూ మిధ్యాసుందరి వాటాలోకి వెళ్ళాను. సాధారణంగా మేడ మీదకు ఎక్కేసరికి మొదటి గదిలోనే మిధ్యాసుందరి కనబడేది. కాని—ఆ వేళ ఆ గదిలో మనుషుల అలికిడే లేదు—అండాళమ్మ ఉన్న జాడ కూడా కనబడలేదు—మెల్లిగా పిలిచాను—ఎవరేనా పలుకుతారేమో నని. ప్రక్క గదిలోంచి నీరసంగా మిధ్యాసుందరి గొంతు వినిపించింది—'లోపలికి రా మూర్తీ—' అని.

ఆశ్చర్యంతో నేను లోపలికి వెళ్ళేసరికి మిధ్యాసుందరి ఆ గదిలో మంచం మీద పడుకుని వుంది. వళ్ళంతా రగ్గు కప్పుకుంది. ముఖం బాగా పాలిపోయినట్టుగా వుంది—అది చూచి తడబడే గొంతుకతో అన్నాను నేను—'ఏమిటిది?—' అని—

'నిన్ననే కొంచెం జ్వరం తగిలింది మూర్తీ!—'ఫ్లూ' అనుకుంటాను. ఇవాళ కొంచెం టెంపరేచర్ ఎక్కువయింది. ఎందుకయినా మంచిదని డాక్టర్‌కు కబురంపించాను—' అంది.

నేను ఎరిగున్నంతలో మిధ్యాసుందరి కెప్పుడూ జ్వరం రాలేదు—అయినా ఆవిడకు ఒంట్లో బాగులేకపోతే చెయ్యడానికి ఎవరున్నారు కనుక ఆ అండాళమ్మ తప్పితే?—నాకు మిధ్యాసుందరి మీద ఎప్పుడూ లేనంత జాలి, అభిమానమూ, పుట్టుకొచ్చాయి. నా మనసు ఆర్ద్రతతో నిండిపోయింది—'నావల్ల నాదగ్గ సహాయం ఏదయినా వుంటే

చెప్పండి— తప్పకుండా చేస్తాను—' అన్నాను.

నా మాటలు విని మిథ్యాసుందరి నవ్వింది —'అంత అవసరం రాదనుకుంటాను, ఆ పరిస్థితి అంటూ వస్తే నిన్ను పిలిచి నీచే సహాయం చేయించుకోగల చనువు నాకుంది— కాదంటావా?—' అంది—

'ఔను—' అన్నాను తల వూపుతూ—

ఇంతలో ఆండాళమ్మ గదిలోకి వచ్చింది, 'మరో అయిదు నిముషాలలో డాక్టరుబాబు వస్తానన్నారు—' అంటూ. ఆ రోజున ముఖ్యమైన పని వుండటంతో డాక్టరు వచ్చేంతవరకూ కూర్చోలేక — రాఘవయ్య గారిచ్చిన డబ్బును టేబిల్ మీద పెడుతూ అన్నాను—'ఇంటి అద్దె ఆయన ఇచ్చారు—' అని. అంతకన్నా ఆ పరిస్థితిలో ఏం మాట్లాడాలో తోచలేదు నాకు. మిథ్యాసుందరి అది విని అదొక సాధారణమైన విషయమైనట్లుగా 'ఊఁ!—' అని వూరుకుంది. నేను మాత్రం మరి మాట్లాడకుండా గదిలోంచి వచ్చేశాను.

ఆ తర్వాత సాధ్యమైనంతవరకూ ప్రతీ రోజూ యూనివర్సిటీనించి వచ్చిన తర్వాత మిథ్యాసుందరి ఇంటికి వెళ్ళి ఆమె యోగక్షేమాలు కనుక్కుంటూ వుండేవాడిని. ఆవిడ జ్వరం మొదట్లో 'ఫ్లూ'గా వచ్చి, ఆ తర్వాత టైఫాయిడ్‌గా మారిపోయింది. వొళ్ళు తెలియని టెంపరేచర్‌తో ఒంటరిగా బాధపడుతున్న మిథ్యాసుందరిని చూస్తూంటే నా మనసు బాధతో తరుక్కుపోయేది. యూనివర్సిటీకి వెళ్ళడం మానేసి ఆవిడ దగ్గరే వుండిపోతే బాగుండునని పించేది. అయితే—ఆండాళ్ళమ్మ వున్నది కదా అనే ఆలోచన నాకు కొంత వూరట కలిగిస్తూ వుండేది. ఇది ఇలా వుండగా ఆండాళమ్మ తండ్రికి వొంట్లో బాగుండ లేదని కబురొచ్చింది. గుండెలు బాదుకుంటూ ఆండాళ్ళమ్మ వర్షాకాలం పరిగెట్టింది. ఆండాళమ్మను ఇంటికి వెళ్ళద్దని చెప్పే అవకాశం మిథ్యాసుందరిలోనూ, నాలోనూ లేకపోయింది. ఒకవేళ మేం అలా చెప్పినా, ఆండాళమ్మ మా మాట వినదని కూడా మాకు తెలుసు. మూడు నాలుగు రోజులలో వస్తానని ఆండాళమ్మ వెళ్ళిపోయింది. ఆండాళ్ళమ్మ వెళ్ళిపోయినప్పుడు మిథ్యాసుందరి కళ్ళల్లో తిరిగిన కన్నీరు నా గుండెల్ని పిండేసింది.

# పిండ్కా

ఆ బాధతోనే నేను—'ఆండాళ్ళమ్మ వచ్చే దాకా మీకు అభ్యంతరం లేకపోతే నేను మీ ఇంట్లోనే వుంటాను— మూడు రోజులు యూనివర్సిటీ మానేసినంతలో మునిగిపోయే దేమీ లేదు—' అన్నాను. నా అంతట నేను ముందుకురావటం మిథ్యాసుందరికి ఎంతో ఆనందాన్ని కలిగించింది. ఆ ఆనందాన్ని పాడు చేయడం నాకిష్టం లేదు.

అయితే— ఈ ఆనందం ఎంతోకాలం నిలవలేదు. మా వూళ్ళో మా పొలాలకు సంబంధించిన గొడవలేవో ఉన్నాయనీ, వాటిని అర్జెంటుగా పరిష్కరించుకోవల్సి వుంది కనుక, తక్షణం బయలుదేరి రావాల్సిందని ఇంటిదగ్గిర్నించి అన్నయ్య రాసిన ఉత్తరం వచ్చింది. నా కసలు ఆ పల్లెటూరి వ్యవహారాలంటేనే తలనొప్పి. అందులోనూ మిథ్యాసుందరి కిలా వుండగా వెళ్ళడం నా కసలు సుతరామూ ఇష్టంలేదు— అందుకే ఇక్కడ యూనివర్సిటీలో రిసెర్చికి సంబంధించిన అత్యవసర కార్యక్రమాలున్నాయనీ, మరికొద్ది రోజుల తర్వాత గాని రాలేనని సమాధానం రాశాను. నా సమాధానం అన్నయ్యకు బోలెడు కోపాన్ని తెప్పించింది. 'వెరీ అర్జెంట్ వర్కు స్టార్ట్ ఇమ్మిడియేట్లీ—' అని ఎక్స్‌ప్రెస్ టెలిగ్రామ్ కొట్టాడు. అన్నయ్య వరస ఎప్పుడూ ఇంతే — అతడికి చదువు సంధ్యాలేదు—దానికి సంబంధించిన విషయాలపై గౌరవం అంతకన్నా లేదు— 'నువ్వు డాక్టరేట్ డిగ్రీ తెచ్చుకుని చేసేదేముందోయ్—చచ్చేంత పొలం వుంది. ఉన్న భూమిని పండించక ఎవళ్ళ దగ్గరో కూలిపని చేసే ఖర్మ నీకేంపట్టిందని?—' అని కేకలేస్తుంటాడు. అన్నయ్య తత్వము, అతగాడి కోపము, నాకు బాగా తెలిసినవే కనుక చేసేదేమీ లేదనుకొని మా ఊరు బయలదేరి వెళ్ళడానికి నిశ్చయించుకున్నాను. అయితే అప్పటికింకా ఆండాళ్ళమ్మ వూరినించి రాలేదు. నా పరిస్థితిని గమనించి తేలిగ్గా నవ్వుతూ అంది మిథ్యాసుందరి—

'సందేహించకుండా వెళ్ళు మూర్తీ!— డాక్టర్‌గారితో చెప్పి నేను నర్సింగ్ హోమ్‌లో చేరుతాను — నిశ్చింతగా వుంటుంది—ఆండాళ్ళమ్మ రావటం కొంచెం ఆలస్యమయినా భయం వుండదు—'

మిథ్యాసుందరి చెప్పిన మాటలు నిజమే అనిపించాయి. అందువల్లనే ఆ పూటే వైజాగ్ నించి బయలుదేరి మా వూరు వెళ్ళాను.

* * *

రెండు రోజులనుకుని బయలుదేరిన వాడిని సల్లా తువిలో దగ్గిర దగ్గిర పదిహేను రోజుల దాకా వుండిపోవాల్సి వచ్చింది. మా భూముల తాలూకు వివాదాలు 'క్లైమాక్స్'కు చేరుకున్నందున— నేను అంత వెంటనే బయలుదేరి వెళ్ళడానికి వీల్లేదన్నాడు అన్నయ్య. ఈ మధ్య కాలంలో మిథ్యాసుందరికి ఆవిడ యోగక్షేమాలు కనుక్కుంటూ ఉత్తరం రద్దామను కున్నాను గాని — మొహమాటం కొంత, బద్ధకం కొంత అడ్డొచ్చి ఆ కార్యక్రమం కాస్తా నిలిచిపోయింది. వ్యవహారాలు పూర్తయిన వెంటనే హడావిడిగా వైజాగ్ రావడానికి బయలుదేరుతూ — ఇంటి—వదినమ్మ సరసమాడింది కూడాను— 'మరిదిగారు వూరెళ్ళడానికి ఎప్పుడూ లేనంత ఆత్రంగా వున్నారు. అక్కడ నాకో తోటికోడల్ని చూసే వుంటారు—' అని. ఎవరేమను కుంటేనేం—నాకు పట్టుపట్టుగా అమరనటి రోజునే ఫస్టు బస్‌లో బయలుదేరి వచ్చేశాను.

అడగడుక్కీ ఆగిపోయే డొక్కు బస్సులో ప్రయాణం చేసి వైజాగ్ చేరు కునేటప్పటికి తొమ్మిదయింది. చలికాలమేమో బారెడు ప్రొద్దెక్కినా ఇంకా చలిగా వుంది. సామాను నా గదిలో పడేసి, స్నానం గీనం పూర్తిచేసుకుని ఊటీ హోటల్‌లో టిఫిన్ బాగా వేసుకుని ఆ రోజునే మిథ్యాసుందరి ఇంటికి బయలుదేరాను. ఆవేళప్పుడు సాధారణంగా రాఘవయ్యగారి ఇంటిలో వుండడం మామూలు. అలా కాకుండా గది తాళం వేసి వుండేసరికి ఎక్కడికో షికార్లకు వెళ్ళారనుకున్నాను. ఇంతలో మేడమెట్ల నుంచి దిగుతూ ఆండాళ్ళమ్మ కనబడింది. పైకి వెళ్ళే దాకా కుతూహలాన్ని చంపుకోలేక— 'అమ్మగారు ఉన్నారా?—' అని అడిగాను. దానికి సమాధానంగా— 'ఉన్నారు బాబూ. అమ్మగారు, అయ్యగారు ఇద్దరూ మేడమీదే

వున్నారు—' అని సమాధానం చెప్పింది. ఆండాళ్ళమ్మ సమాధానం ఒక్కసారి నా బుర్రలో 'గుంయ్'మనిపించింది. 'అయ్యగారెవరు?—' అనే ప్రశ్న నోటిదాకా వచ్చి అలా అడగడం సభ్యతకాదు కనుక, నా భావాన్ని అదుపులోకి తెచ్చుకుంటూ గబగబా మేడమీదకు వెళ్ళేను. మేడమీద గదిలోకి అడుగు పెడుదును కదా — నాకో పెద్ద సైజు 'షాక్' తగిలినట్టయింది. గదిలో రాఘవయ్యగారు పేపరు చదువుకుంటున్నారు. అడుగులు చప్పుడు విని ప్రక్కకు తిరిగి నన్ను చూడగానే నవ్వుతూ అన్నారు రాఘవయ్యగారు— 'రావోయ్ — మూర్తీ రా—'

నాకు కాళ్ళక్రింద వున్న భూమంతా గిరగిరా తిరుగుతున్నట్టనిపించింది. రష్యాలో కేపిటలిజమ్ ప్రబలినా— అమెరికా కమ్యూనిజమ్‌ను చేపట్టినా నేనంత ఆశ్చర్యపడక పోదునుగాని—మిథ్యాసుందరి ఇంట్లో రాఘవయ్యగారు తీరుబడిగా పేపరు చదువుతూండడాన్ని మాత్రం నిజమని నమ్మడానికి నా మనసొప్పడం లేదు నా కళ్ళను నేనే నమ్మలేక పోతున్నాను. ఆండాళమ్మ చెప్పిన అయ్యగారు ఈయనే అన్నమాట—డామిట్?. బుర్ర తిరిగి పోతోంది. నేను మా వూళ్ళో పడుకుని నిద్రపోవడం లేదు కదా!— .

నా అవస్థ గమనించి కాబోలు నవ్వుతూ అన్నారు రాఘవయ్యగారు — 'ఏమిటలా గుమ్మం దగ్గరే నిలబడి పోయావు? — మా యింట్లోకి రాకూడదనుకున్నావా ఏమిటి?' మరోషాక్— 'మా యిల్లు' అంటాడేమిటీయన? — ఏమిటీ ఘోరం? — రాఘవయ్యగారికి మతిపోలేదు కదా—వెళ్ళేటప్పుడు నిక్షేపంలా వున్నారు—ఇంతట్లోనే ఏమొచ్చిందని — మెల్లగా నా మదురును చేతో తడుముకున్నాను. అతి ప్రయత్నంమీద నా మనోభావాన్ని తమాయించుకుంటూ — 'మిథ్యాసుందరికి ఎలా వుంది?—' అని మాత్రం అనగలిగాను.

'నాలుగు రోజుల క్రితమే పత్యం పుచ్చుకుంది. పాడు జ్వరం చాలా ఇబ్బంది పెట్టేసింది. అన్నట్లు మీ వ్యవహారాలేమయినట్టు?—' అన్నారు రాఘవయ్యగారు పేపరు మడుస్తూ. నేనేదో సమాధానం చెప్పేలోపుగానే — మిథ్యాసుందరి ట్రేలో కాఫీ కప్పుతో గదిలోకి వచ్చింది.

మిథ్యాసుందరిని చూస్తూ, రాఘవయ్యగారు 'నువ్వు ఒక కప్పు కాదు—రెండు కప్పులు తేవాల్సింది—నీకోసం చివలొచ్చారో చూడు—' అన్నారు.

రాఘవయ్యగారు రోజుకు అయిదారుసార్లు కాఫీ త్రాగుతారన్న సంగతి నాకు క్రొత్తేమీ కాదు కాని—ఇలా మిథ్యాసుందరి ఆప్యాయంగా రాఘవయ్యగారికి కాఫీ తేవడమూ, ఆయన ఆవిడకు మరో కప్పు తెమ్మని పురమాయించడమూ, మధ్య నేను నిశ్శబ్ద ప్రేక్షకుడిలా వుండిపోవడమూ, చూస్తుంటే, నాకు తల తిరిగిపోతోంది. నేను వచ్చింది వైజాగుకేనా! —నేను చూస్తున్నది రాఘవయ్యా, మిథ్యాసుందరి అసబడే, ఉత్తర దక్షిణ ధృవాలనేనా!—అని మరోసారి అనుమానం వచ్చింది. నాకు భగవంతుడంటే ఇన్నాళ్ళుగా చెప్పుకోదగ్గ భక్తి లేదు గాని—ఒక్కసారిగా భక్తి పుట్టుకొచ్చింది—'భగవాన్!—నాకు పిచ్చి ఎక్కలేదు కదా—' అని మొదటిసారిగా భగవంతుణ్ణి స్మరిస్తూ గొణుక్కున్నాను.

నన్ను చూడగానే మిథ్యాసుందరి బోలెడు సరదా పడిపోయింది—'రెండు రోజులని ఎన్నాళు ండిపోయావు మూర్తీ!—నీ గురించి అనుకోని రోజు లేదు—' అంది. మిథ్యాసుందరి ఇదివరకటికన్నా బాగా చిక్కినట్లనిపించింది. కొంచెం నీరసంగా కనబడుతున్న మాట నిజమే కాని—దానికన్నా నాజూకుతనమే నాకు ఎక్కువ కనబడింది. ఆవిడ కట్టుకున్న నారింజరంగు ప్లెయిన్ కలర్ చీరలో ఇంత నాజూగ్గా మిథ్యాసుందరిని ఎప్పుడు చూడలేదు నేను.

నానుంచి సమాధానం వచ్చేలోపున కాఫీ కప్పును నా ముందు వుంచుతూ అంది మిథ్యాసుందరి— 'కాఫీ తీసుకో—రాఘవయ్యగారికి ఇప్పుడే తీసుకొస్తాను—' అంటూ లోపలికెళ్ళి మరో నిముషంలో ఇంకో రెండు కప్పులతో వచ్చింది. ముగ్గురం తీరిగ్గా కాఫీ త్రాగుతూండగా చాలా విషయాలు బయటపడ్డాయి.

'నువ్వు వూళ్ళో లేని ఇరవై రోజుల్లో నీకు తెలియకుండా చాలా విషయాలు జరిగిపోయాయి మూర్తీ—' అంటూ ప్రారంభించింది మిథ్యాసుందరి.

అది విని తల పంకించుతూ, 'అవును ఇప్పుడిప్పుడే అర్థం అవుతోంది—' అన్నాను కొద్దిగా చిరునవ్వును చిందిస్తూ—నా నవ్వుకు జతచేరుస్తూ అన్నారు రాఘవయ్యగారు— 'అయితే—నువ్వు అర్థం చేసుకోవాల్సింది ఇంకా చాలా వుంది—' అన్నారు.

'నిజమే—' అన్నాను—

మళ్ళీ మిథ్యాసుందరే మొదలెట్టింది—'నువ్వు మీ వూరకు వెళ్ళడానికి సందేహిస్తూ వుంటే నేనే బలవంతం పెట్టి పంపించాను—అప్పాళో, లేకపోతే ఆ తర్వాతరోజో ఆండాళమ్మ తప్పకుండా వస్తుందన్న ధైర్యంతో — అంతగా అవసరం అయితే నర్సింగ్ హోమ్‌లో చేరుదామనుకున్నాను. అనుకున్నట్టుగా ఆండాళ్ళమ్మ రాలేదు. నర్సింగ్ హోమ్‌లో చేరడమూ జరగలేదు— అనుకోనట్టుగా ఓ చిన్న కథ జరిగిపోయింది—' అంటూ చిన్నగా నవ్వి తల దించుకుంది. యాభై ఏళ్ళు పైబడ్డ మిథ్యాసుందరి అలా అందంగా సిగ్గుపడుతూంటే చూడ్డం నాకు మహా ముచ్చటేసింది. హఠాత్తుగా మిథ్యాసుందరి వయస్సు ఓ ముప్ఫయ్ ఏళ్ళు తగ్గించేస్తే ఎలా వుంటుందో అనిపించింది.

మధ్యలో రాఘవయ్యగారు అందుకున్నారు —'జీవితంలో ఇద్దరమూ ఆనందాన్ని పోగొట్టుకున్నాము. పోయిన ఆనందాన్ని ఇంత సులువుగా తిరిగి పొందగలమని—ఒకవేళ పొందినా అందులో మళ్ళీ అంత మాధుర్యం వుంటుందనీ అనుకోలేదు మేము.'

రాఘవయ్యగారు ఇంకా ఏం చెప్పినా, చెప్పకపోయినా జరిగిన కథ వూహించుకోగలను. వాళ్ళు పోగొట్టుకున్న ఆనందమేదో నాకు తెలుసు—మళ్ళీ వాళ్ళు పొందిన ఆనందాన్ని అర్థం చేసుకోగలను. అయితే—అర్థం కాని విషయాలు, అర్థానికి అందని విషయాలు నాకు చాలా కనబడ్డాయి. అందుకనే బుద్ధిమంతుడయిన విద్యార్థిలా బుర్ర వూపుతూ కూర్చున్నాను. రాఘవయ్యగారే మాట్లాడుతున్నారు— 'మూర్తీ! — నువ్వు పసిపిల్లవాడివేమీ కావు—నీ తెలివి తేటల్ని నేనెరుగుదును. మా గురించి ఈపాటికి నువ్వు కొంత అర్థం చేసుకుని వుండొచ్చు. కాని—వర్తమానాన్ని అర్థం చేసుకునేముందు కొంత గతాన్ని గురించి కూడా తెలుసు

కోవాలి నువ్వు. నేను రాయగఢలో అసిస్టెంటు స్పెషల్ మాష్టర్‌గా పనిచేస్తుండగా నా భార్య చచ్చిపోయింది. అప్పటికి నాకు ముప్ఫయి అయిదు సంవత్సరాలు. మాది ఓ విధంగా చెప్పాలంటే లవ్ మేరేజ్ అని చెప్పుకోవాలి — అనుకూలవతియైన భార్య— జిలిబిలి పలుకులు పలుకుతూండే మూడేళ్ళ కొడుకు—ఆ రోజు వరకూ సంసార జీవితం స్వర్గంలా వుండేది. కాని, ఒక ఏక్సిడెంట్‌లో వాళ్ళిద్దరిని ఒకేసారి కోల్పోయాను నేను. ఈ జీవితంలో ఒక్కణ్ణీ మిగిలిపోయాను. ఒంటరితనం భరించలేక కొన్నాళ్ళు సెలవుపెట్టి దేశమంతా తిరిగాను. ప్రతిచోట ఒంటరితనమే మిగిలేది. జ్ఞాపకాలు నా గుండెల్ని పీల్చి పిప్పి చేసేవి. ఒక్కణ్ణీ కూర్చుని ఏడిచేవాడిని చచ్చిపోదామనుకునేవాణ్ణి— ఇంత మానసిక దుర్బలత్వం మొగాడికి పనికిరాదన్నారు కొందరు. మొగాడివి నీకేం భయం? హాయిగా మళ్ళీ పెళ్ళిచేసుకో అని సలహా ఇచ్చారు మరి కొందరు మొగతనం ఇచ్చే అవకాశాలమీద నాకెప్పుడూ వ్యామోహంలేదు. మళ్ళీ పెళ్ళిచేసుకోలేదు. కాని—ఒంటరితనం పీడించినప్పుడల్లా నాకు నా భార్య జ్ఞాపకంవచ్చేది నాకు కావాల్సింది ఒక ఆడదికాదు. నన్ను ప్రేమించి—నా అభిమానాన్ని అందుకునేందుకు పాత్రతగల స్త్రీ కావాలి నాకు. అలాంటి స్త్రీమూర్తికోసమే నేను ఎంతో కాలం వెదికి నే పోగొట్టుకున్న ఆనందం మరి దొరికేదికాదని తెలుసుకుని నా ప్రయత్నం విరమించుకున్నాను. కాని...' మధ్యలో రాఘవయ్యగారు ఆగి ఆరిపోయిన చుట్టను వెలిగించే ప్రయత్నంలో మునిగిపోయారు.

రాఘవయ్యగారు మరేదో చెప్పేలోపుగానే మిథ్యాసుందరి అందుకుంది. 'రాఘవయ్య ఆదర్శవాది. ఆయన మాటలు చాలా చిత్రంగా వుంటాయి. ఆయన్ని కాస్సేపు అలా ఆదర్శాల లోకంలోనే వుండనిచ్చి నేను చెప్పేది విను.'


రాఘవయ్యగారి కథను మధ్యలో మిథ్యాసుందరి అలా ఆపేయడం నాకు బొత్తిగా నచ్చలేదు— కాని, ఆవిడ రాఘవయ్యగారికి చాలా సన్నిహితురాలు కనుకా, ఆవిడ కథనుకూడా వినాలని చాలా కుతూహలంవున్నది కనుకా, మాట్లాడక వూరుకున్నాను. సరే చెప్పమన్నట్టుగా రాఘవయ్యగారు చుట్టనుసి రాలుస్తూ వుండిపోయారు.

'రాఘవయ్యగారిలా నాకు గతాన్ని తవ్వుకునే ఓపికలేదు. కాని, నా గురించి కూడా కొంత తెలుసుకోవాలి నువ్వు. మా ఆయన సంగతి నీకిదివరకే కొద్దిగా చెప్పాను. నేను, నా భర్తా అన్యోన్యంగా వుండేవాళ్ళం అన్నమాట ఒకవిధంగా నిజమే — అయితే ఆయన లేనిలోటు నన్నెప్పుడు ఒంటరితనంతో బాధపెట్టలేదు—ఎందుకంటే నేను పెళ్ళికి ముందు, ఆ తర్వాతకూడా వుద్యోగరీత్యా ఒక్కతినే వుండేదాన్ని—పెళ్ళి అయిన తర్వాత హనీమూన్ రోజుల్లోనూ, ఆపైన సెలవుల్లోనూ మాత్రమే మేమిద్దరం కలిసివుండేవాళ్ళం. ఆ కొద్దిరోజుల్లోనూ మా మధ్య చాలాసార్లు పోట్లాటలువస్తుండేవి. నా రుచులు ఆయనకు నచ్చేవికావు. ఆయన అభిరుచులు నాకు సుతరామూ పడేవికావు. ఇలా పోట్లాడి లాభంలేదు. ఎవరో ఒకళ్ళం సర్దుకోవాలి అని నిర్ణయం తీసుకునే లోపుగానే సెలవులు కాస్తా పూర్తయ్యేవి. ఇలా మొత్తంమీద ఒక చిత్రమైన రీతిలో మేమిద్దరం కాపరంచేశాం. అయితే కడుతూవున్న బ్రిడ్జికూలి ఆయన చచ్చిపోయినప్పుడు ఇన్సూరెన్సురూపంలో అయితేనేమీ, బేలకు బేలన్సురూపంలో అయితేనేమీ నాకు దగ్గర దగ్గర లక్షరూపాయలు చేతికొచ్చినప్పుడు మాత్రం నా గుండెలు ఆర్ద్రతతో నిండిపోయాయి. ఈ యింటిలోవున్న ప్రతిఇటుకా ఆయన స్మృతిని జ్ఞాపకం చేస్తుంటే—కృతజ్ఞతతో నిండిన గుండెల్తో ఆయన్ని ఎన్నిసార్లు తలుచుకుంటానో లెక్కలేదు. పొడుగ్గా పొడుచుకొచ్చినట్టు వుండే ముక్కును మినహాయిస్తే ఆయన చాలా అందంగా వుండేవారు. తోడెవరూ లేకుండా ఒక్కతెనే ఉన్నప్పుడు ఆయనరూపం ఎన్నిసార్లు కళ్ళల్లో మెదలేదో లెక్కపెట్టలేను...' డగ్గుత్తిక అడ్డుపడితే మౌనంగా కళ్ళనీళ్ళు తుడుచుకుంది మిథ్యాసుందరి.

వీళ్ళిద్దరి మాటలూ నాకు తలా తోకా లేని మాటల్లా కనబడ్డాయి. నేను అడిగేది ఒకటి—వీళ్ళు చెప్పేది ఒకటి. నాక్కావల్సిన సమాధానానికీ, వీళ్ళు చెప్పే గతకాలం జ్ఞాపకాలకీ సంబంధంలేదు. వీళ్ల పాతజ్ఞాపకాలు ఎవడిక్కావాలి? గతంతో తనకు సంబంధం లేదంటూనే దాన్ని ఓపిగ్గా తవ్వుతోంది మిథ్యాసుందరి. విసుగ్గా భృకుటి ముడుచుకున్నాను. అయితే— అంత సులువుగా నా భావాలను బయటపెట్టడం నాకు ఇష్టంలేదు.

గట్టిగా దమ్ములాగిన పొగను పైకి వదలుతూ అన్నారు రాఘవయ్యగారు— 'ఆడవాళ్ళకు సెంటిమెంటాలిటీ బొత్తిగా ఎక్కువోయ్!—ఒకవిధంగా చెప్పాలంటే నేను, మిథ్యాసుందరీ, గతాన్ని మరచిపోలేకపోతున్నాం—మా యిద్దరిలోనూ ఒకేవిధంగా వున్న ఈ భావం మమ్మల్ని కలిపిందనుకుంటాను—కాకపోతే—నేను మిథ్యాసుందరిలాగా నా సెంటిమెంట్లను బయటకు చెప్పలేననుకో...'

అటు రాఘవయ్యగారు, ఇటు మిథ్యాసుందరీ, ఒకళ్ళకొకళ్లు పోటీపడుతూ కథను మరింత డొంక తిరుగుడుగా తిప్పుతున్నారు. ఇక, సహనం నిల్పుకోలేని నేను — 'అసలు



## మిధ్యా

కథ చెప్పండి' అంటూ నిజం చెప్పద్దూ— కొంచెం మొరటుగానే అడిగాను. అయితే— ఆ అసలు కథ వాళ్ళు చెప్పినంత యాదా లాపంగా నాకు అనిపించలేదు— నమ్మబుద్ధి పుట్టలేదు.

ఆడవాళ్ళెవ్వరూ లేని సమయంలో మిధ్యా సుందరి జ్వరతీవ్రత ఎక్కువయితే — మొదటిలో రాఘవయ్యగారు ఆమెకి తగిన శాస్తి జరిగిందిలే అని సంతోషించారట— కానీ, ఓ పూట పోయింతర్వాత ఆయనలో దాగివున్న జాలి అనేపదార్థం ఆయన గుండె తలుపులు తట్టి— మేడమీదకు వెళ్ళమని తొందరపెట్టిందట—వద్దనుకుంటూనే ఆయనపైకి వెళ్ళి మిధ్యాసుందరి గదిలో అడుగుపెట్టారట—

'నువ్వు నమ్మవుగానీ మూర్తీ! — ఆ రోజున ఒక్కర్తినీ పడుకుని ఏంత ఏడ్చానో భగవంతుడికి తెలియాలి —జ్వరం కన్నా నన్ను నా ఒంటరితనమే బాధించింది. ఆ క్షణంలో నేను చచ్చిపోయినా అయ్యో అంటూ కన్నీళ్ళు కార్చేవారు కూడా వుండరనే భావం నా గుండెను పిండి వేసింది—కన్నీళ్ళను రెచ్చగొట్టింది. ఆ క్షణంలోనే నా కళ్ళకు రాఘవయ్యగారు కనబడ్డారు. బెదురు చూపులు చూస్తూ గదిలోకి వస్తున్న రాఘవయ్యగారిని చూస్తూంటే నాకు ఏడుపు మరింత ముంచుకొచ్చింది. నాకీ ప్రపంచంలో వున్నది ఈ రాఘవయ్యగారొక్కరే అనిపించింది...' అంటుంది మిధ్యాసుందరి. ఆవిడ మాటలకు అడ్డుతగులుతూ రాఘవయ్యగారంటారు కదా—

'మూర్తీ! నీకు ఆడవాళ్ళతో పరిచయం తక్కువయినందున వాళ్ళ సైకాలజీ నీకంత బాగా తెలియదు. నాకు వాళ్ళ సంగతి బాగా తెలుసు. మనోధైర్యం కోసం ఆప్యాయత కోసం, ఆత్మీయత కోసం ఆడది మొగాడి గుండెల్లో తల దాచుకోవాలని కోరకుంటుంది. తప్పని సరిగా ఒంటరితనం ముంచుకొస్తే భరించ లేక ఘోరుమంటుంది. మిధ్యాసుందరి ఆవేళ ఏడుస్తూ వుంటుందని నాకు తెలుసు. అది శాస్త్రం. అనుకుంటాంగాని మూర్తీ — మొగాడు ఆడదాన్నెప్పటికీ ద్వేషించ లేడేమో?— లేకపోతే నాకు మిధ్యాసుందరి మీద అంత జాలి ఏందుకు కలగాలి? — ఆవిడ ఒంటరితనం నాగుండెల్నెందుకు కరిగించాలి?—వొళ్ళు తెలియని జ్వరంతో మిధ్యాసుందరి అవస్థపడుతున్నప్పుడు ఆవిడకు నేను తప్ప మరెవ్వరూ లేరనీ, ఆపదలో వున్న ఆమెను ఆదుకోవల్సిన వ్యక్తి నేనొక్కడినేననీ, అనే భావన నాకు తెలియకుండానే నాచేత మిధ్యాసుందరికి ఏన్నో సేవల్ని చేయించింది ఆవిడకు నాకు మధ్య విరోధం సమసి పోయేటట్లు చేసింది—'

నాకు రాఘవయ్యగారి మాటల్లోనూ, మిధ్యాసుందరి మాటల్లోనూ, ఏదో తెలియని ఆవేశం కనబడింది. మిధ్యాసుందరి మటుకు మధ్యమధ్యలో క్రొత్త పెళ్లికూతుర్లా సిగ్గుపడేది— 'నా కోసం రాఘవయ్యగారు చేసే చాకిరీ, నాపై ఆయన చూపిస్తున్న శ్రద్ధ చూస్తూంటే —నువ్వు నమ్మవుగనీ మూర్తీ— ఆయన అలా నా దగ్గర వుంటూండగానే చచ్చిపోవాలనిపించేది. ఆడవాళ్ళను అనవసరంగా

పిల్లలు—ఆరోగ్యము

# ప్రమాదాలు - జాగ్రత్తలు

చిన్నపిల్లలని ప్రమాదాల నుంచి కాపాడటం అన్నది తల్లిదండ్రుల, వైద్యుల ముఖ్య కర్తవ్యం. ఒక సంవత్సరం లోపు వయసులో జరిగే ప్రమాదాల వల్ల మరణం సంభవించవచ్చు. లేదా నిరంతరమైన శారీరక లోపం ఏర్పడవచ్చు. ప్రమాదాలు ఎక్కువగా 3 సంవత్సరాలు, అంతకు లోపు పిల్లలకి సంభవిస్తూ ఉంటాయి. వీటిలో చాలా భాగం ఇళ్లలోనే సంభవిస్తుంటాయి. ఇలాంటి ప్రమాదాలు ఏర్పడకుండా ఈ కింద సూచించిన జాగ్రత్తలు తీసుకోడం చాలా అవసరం.

చిన్నపిల్లల మనస్తత్వం, అలవాట్లు పెద్దలు గమనించాలి. పిల్లలు వారి జాగ్రత్తలో వారు ఉండేలా అలవాటు చేయాలి. ప్రమాదాలకి కారణాలని పెద్దలు తెలుసుకుని అవి సంభవించకుండా ముందుగానే జాగ్రత్తలు తీసుకోవాలి.

### మొదటి సంవత్సరంలో సంభవించే ప్రమదాలు

ఈ వయసులో పిల్లలు పాకటం, దొర్లటం చేస్తుంటారు. చేతికి అందిన వస్తువులని నోటిలో పెట్టుకోడం ద్వారా ప్రమాదాలు జరగవచ్చు. వేడిగా ఉండే వస్తువులని పట్టుకొనడం, మందులు, విషపదార్థాలు నోట్లో పెట్టుకోడం వంటివి చేసే అవకాశం ఉన్నది. నీళ్ళతొట్టెలు అందుబాటులో ఉండటం వల్ల వాటిలో మునిగిపోవడం జరగవచ్చు.

### తీసికొనవలసిన జాగ్రత్తలు

పిల్లలని మంచాలు, బెంచీలు, కుర్చీలు మొదలైన వాటిమీద వదిలిపెట్టి వెళ్లకూడదు. చిన్నచిన్న వస్తువులనీ, మందులని అందుబాటులో ఉంచకూడదు. నీళ్ల తొట్టెలు ఉంటే వాటిని మూసి ఉంచాలి.

### రెండవ సంవత్సరంలో ప్రమాదాలు

ఈవయసులో పిల్లలకి నడక బాగా అలవాటు అవుతుంది. కాబట్టి మెట్లు ఎక్కడం, దిగటం చేస్తుంటారు. అన్ని విషయాల్లో ఆసక్తి ఎక్కువగా ఉంటుంది. కాబట్టి మెట్ల మీద నుంచి పడటం, అందిన వస్తువులని నోట్లో పెట్టుకోడం వల్ల ప్రమాదాలు జరగవచ్చు.

### జాగ్రత్తలు

మెట్లకి గేటు వేయాలి. కరెంటు తీగలు, మందులు, పదునైన వస్తువులు చేతికి అందకుండా పెట్టాలి. కిటికీలకి కూడా తెరలు వేసి ఉంచడం మంచిది.. కుంపట్లు, స్టవ్‌లు, గ్యాస్ పొయ్యిలు అందుబాటులో లేకుండా చూడాలి.

### మూడు, నాలుగు సంవత్సరాల వయసులో

పిల్లలు వీధిలోకి పరిగెత్తడం, బంతులు విసరటం వంటి ఆటలు మొదలుపెడతారు. వీటి వల్ల కూడా ప్రమాదములు జరగటానికి అవకాశాలు ఉన్నాయి.

### జాగ్రత్తలు

తలుపులు గట్టిగా వేసి ఉంచాలి. ప్రమాదాన్ని కల్గించే వస్తువులని దూరంగా ఉంచాలి.

అయిదు సంవత్సరాల నుంచి 9 సంవత్సరాల లోపు పిల్లలకి కొస్త ధైర్యం వస్తుంది. చుట్టుపక్కల ఉన్న పిల్లలతో ఆడుకోడం అలవాటవుతుంది. ఈ వయసులో ప్రమాదములకి అవకాశంలేని ఆటల పైకి పిల్లల దృష్టి మరల్చడానికి పెద్దలు ప్రయత్నించాలి.

ఈ వయసులో పిల్లలు స్కూళ్లకి, నర్సరీ బడులకి, కాన్వెంటు పాఠశాలలకి వెళ్తుంటారు. రోడ్డు ప్రమాదాల నించి వారిని రక్షించడానికి తోడుగా ఎవరైనా ఉండి రోడ్లపై జాగ్రత్తగా నడవటం, రోడ్లు దాటటం మొదలైన విషయాలని పిల్లలకి జాగ్రత్తగా నేర్పాలి. ఇలాంటి జాగ్రత్తలు తీసుకోడం ద్వారా పిల్లని ప్రమాదాలకి గురి కాకుండా చాలా వరకూ కాపాడవచ్చు.

—డాక్టర్ కె. వెంకటేశ్వరరావు

అంటారు గానీ, మూర్ఖ్ — ఈ మొగాళ్లే అసలు అర్థంకాని మనుషులు. పనిగట్టు కుని నా మీద జాలితో నేను జ్వరంతో వున్నాన్నాళ్ళు సేవ చెయ్యడానికి వచ్చారా?— అంతటితో సరిపడితే పోలా?—టెంపరేచర్ చూస్తున్నప్పుడు నా వొళ్ళెందుకు నిమర లని?—మందుపట్టిస్తూ తుంటరి చేష్టలు ఎందుకు చెయ్యాలని ?—'

రాఘవయ్యగారిదీ, మిధ్యాసుందరిదీ 'ప్లెటోనిక్' బాపతు ప్రేమ అని సరి పెట్టుకుందామనుకుంటే గింజుకు చచ్చినా నాకు ఆధారాలు దొరకలేదు— రిటైరయి పోయిన రాఘవయ్యగారు మిధ్యాసుందరి వైపు చూచే చూపులోను, మిధ్యాసుందరి రాఘ వయ్యగారిపై విసిరే విసుర్లలోనూ, నాకు పురుషుడికి, స్త్రీకి మధ్యన వుండే ఆక ర్షణ మాత్రమే కనబడింది. అయితే— ఆ ఆకర్షణలో కామం కన్నా ఆత్మీయత పాలే ఎక్కువగా కనిపించింది. ఇది నేను కాదందా మనుకున్నా వాళ్ళ వయస్సులు అందుకు ఒప్పుకోవు—అందుకే మిధ్యాసుందరి అన్న మాటల్ని బేషరతుగా ఒప్పేసుకున్నాను.

'ఎంత వయస్సు వచ్చినా — తనకొక ఆసరా కల్పించే మొగాడు కావాలనీ ఆడది కోరుకుంటుంది. తనవల్ల ఆసరా పొందు తున్న ఆడది వుండాలని మొగాడు కోరు కుంటాడు. ఆధారపడటంలో ఆడదానికి సంతృప్తి వుంది—ఆధారం అవుతున్నారు కదా అనే అహంలో మొగాడికి తృప్తి వుంది. ప్రకృతిలో స్త్రీ పురుషుల మధ్య వున్న ఈ విభిన్న ప్రవృత్తే మా యిద్దరినీ కలిపిందనుకుంటాను. మాది అసాధారణ మైన ప్రేమకథ కాదు—మాములు జీవిత కథ—'

నిజమే అనిపించింది. అయితే — నాకు చాలా సందేహాలున్నాయి. స్త్రీ పురుష ప్రవృత్తులలో వున్న స్వార్ధమే భార్యా భర్తల కలయికకు కారణమైతే — అటు మిధ్యాసుందరి, ఇటు రాఘవయ్య, ఇన్నాళ్ళుగా ఒంటరిగా ఎందుకు ఉండి పోయారు? — ఒక అతి చిన్న కారణం వారిద్దర్నీ అంత గట్టిగా ఎందుకు బంధిం చింది?—ఇన్నాళ్ళుగా రాఘవయ్యగారు వెదుకు తున్నదీ, మిధ్యాసుందరిలో ఆయనకు దొరికినదీ ఏమిటని? — నా సందేహాలన్నిం టికీ మిధ్యా సుందరి సన్నగ చిరునవ్వు నవ్వుకుంది. రాఘవయ్యగారు మాత్రం కాసీగా చుట్టపీలుస్తూ— 'నువ్వు పెళ్లి గాని కుర్రాడివి. నీకేం చెప్పినా అర్ధం కాదు—జీవితంలోని సత్యాలు అనుభవించి తెలుసుకోవాలి—' అన్నారు.

రాఘవయ్యగారి సమాధానం నాకు రుచించలేదు— గోడమీద అందంగా నవ్వు తున్న హేమమాలిని కేలండర్ బొమ్మకేసి చూస్తూ 'అంతా మిథ్య' అని గొణుక్కున్నాను.

రోడ్డుమీద పెళ్లివారి బాజాలు నా చెవుల్లో గింగురుమంటున్నాయి.

(అయిపోయింది) ●

(వైవాలో జరిగిన 'ఒక విపరీతం' వార్తల్లో చదివాక —రచయిత.)

# పంచాక్షరి — ధర్మపథం



— బులుసు వెంకటరమణయ్య

శివకళవు లిద్దరిలో శివుడే చాలా సులభుడనీ, నిర్నిబంధంగా కోరిన కోరిక లిస్తాడనీ ప్రసిద్ధి. 'నమశ్శివాయ' అనే పంచాక్షరీ మంత్రాన్ని జపించినట్లయితే సమస్త పాపాలూ నశిస్తాయని శివపురాణం చెప్తూ ఉన్నది.

'నమస్కారాది సంయుక్తం
శివాయేత్యక్షరత్రయమ్,
జిహ్వాగే వర్తతే యస్య
సఫలం తస్య జీవితమ్,
పంచాక్షర జపే నిష్ఠో
ముచ్యతే పాప బంధనాత్.'

'నమఃశివాయ' అనే మంత్రాన్ని ఎవరు ఉచ్చరిస్తారో, వారి జీవితం ధన్యమైనదని, దాన్ని జపించినవారు పాపాలనుండి విముక్తు లౌతారని దీని అభిప్రాయం.

కాశీ రాజపుత్రిక కళావతి గొప్ప శివ భక్తురాలు. ఆమె పంచాక్షరీ జపం చేస్తూ నిష్ఠతో ఉండేది. ఆ మంత్ర ప్రభావం వల్ల ఆమె పాపాలన్నీ నశించాయి.

మధురాపుర రాజపుత్రుడు దాశార్హుడు ఆమెను వివాహం చేసుకున్నాడు. అతడు ఆమె శరీరాన్ని స్పృశించగా, అతని చెయ్యి చురికింది. అతడు ఆశ్చర్యపడి కారణం అడిగాడు—

'నేను పంచాక్షరీజపం చేస్తూ ఉంటాను. అందువల్ల నాలోని పాపాలు అన్నీ నశించి నా శరీరం పవిత్రంగా ఉంటుంది. అప విత్రమైనవారు స్పృశిస్తే చురుకుతుంది. మీ శరీరం అపవిత్రమైనదై ఉండాలి' అన్నది.

రాజకుమారుడు తనకు ఆ మంత్రాన్ని ఉపదేశించాలని భార్యను కోరాడు. ఆమె, భర్తకు ఉపదేశంచేసే హక్కు భార్యకు లేదనీ, గర్గమహామునివద్దకుపోయి ఉపదేశం పొందాలనీ చెప్పింది. దాశార్హుడు ఆ మహా ముని వద్దకుపోయి, ప్రార్థించి పంచాక్షరీ మంత్రోపదేశాన్ని పొందాడు.

దాశార్హుడు ఆ మంత్రాన్ని నిష్ఠతో జపించసాగినాడు. కొలదికాలానికే అతని శరీరంనుంచి వందలకొద్దీ కాకులు వెలువడి నేలపైబడి భస్మం కాసాగినవి. అతడు ఆశ్చర్యపడి 'ఇదేమిటి ?' అని గురువును ప్రశ్నించాడు.

'నాయనా! నీ శరీరంలో ఉండే పాపాలు ఈ వాయస రూపంలో బయటికి వచ్చి నశి స్తున్నాయి. కొద్దికాలం యింకా జపం చేస్తే నీవు నిష్కల్మషుడవు కాగలవు' అని ఆయన జవాబిచ్చాడు.

కొలదికాలంలోనే దాశార్హుడు విగత కల్మషుడైనాడు.

తర్వాత అతడు తన భార్య శరీరాన్ని తాకితే వేడిగాకాక చల్లగానే ఉండినది. ●